నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతల్: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చిన్న తోకట్ట 33/11 కేవీ సబ్ స్టేషన్ పంచవటి, పార్క్ వ్యూ ఫీడర్ల పరిధిలో పార్క్ వ్యూ ఎంక్లేవ్, గ్రీన్ వ్యూ ఎంక్లేవ్, ఫరీద్ నగర్, అగ్రహార నగర్, మనో వికాస్ నగర్, రిలయన్స్ విల్లా మార్ట్ రాయల్ ఎంక్లేవ్, ఎస్‌బీఐ కాలనీ, అరవల్లి ఎంక్లేవ్, ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కెవి గన్ రాక్ సబ్ స్టేషన్ అంజయ్య నగర్ ఫీడర్ పరిధిలో అంజయ్య నగర్, బోయిన్‌పల్లి వెజిటేబుల్ మార్కెట్ సరౌండింగ్ ప్రాంతం, సుబ్బారెడ్డి హౌస్ తదితర కాలనీలు, ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిన్న తోకట్ట సబ్ స్టేషన్ హస్మత్‌పేట ఫీడర్ పరిధిలో హస్మత్ పేట, ముస్లిం బస్తీ, లైన్ స్టోన్ కాలనీ, అగ్రహార నగర్ తదితర ప్రాంతాల్లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలలో అంతరాయాలు ఉంటాయని, వినియోగదారులు సహకరించాలని ఏడీఈ కోరారు.

కుత్బుల్లాపూర్: గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాలను సురక్షితంగా తరలిచేందుకు వీలుగా చేపట్టనున్న పనుల వల్ల శనివారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జీడిమెట్ల విలేజ్, పిస్తాహౌస్ ప్రాంతాల్లో, 11కేవీ జయరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జయరామ్‌నగర్, జేకే నగర్, 11కేవీ దుర్గా ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు దుర్గా ఎస్టేట్స్, వెన్నెలగడ్డ, బౌద్ధనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఎట్టకేలకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం




జగద్గిరిగుట్ట: ప్రభుత్వం గత సంవత్సరం ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి ప్రారంభించింది. జగద్గిరిగుట్ట ప్రాంతంలోని రాజీవ్ గృహకల్ప సమీపంలో వార్డు కార్యాలయం పక్కన మహిళా శక్తి క్యాంటిన్‌ను గత సంవత్సరం నవంబర్‌లో ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టుమని 10 రోజులు కూడా తెరవలేదు. ఈ విషయమై పలు మార్లు 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో ఇటీవలే ఈ మహిళా శక్తి క్యాంటీన్‌ను తెరిచారు.

ఘనంగా రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతి



జగద్గిరిగుట్ట: రాజా బహదూర్ వెంకట రామారెడ్డి జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జగద్గిరిగుట్ట రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెంకట రామారెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వెంకట రామారెడ్డి బాలుర కోసం విద్యాలయాలు, హాస్టళ్లు స్థాపించారని గుర్తు చేసుకున్నారు. అధ్యక్షులు పాపిరెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, తిరుమల్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, వీరా రెడ్డి, అనంత రెడ్డి, సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్టు



కుత్బుల్లాపూర్: శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును కాంగ్రెస్ ప్రభుత్వం హరిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం సెక్రటేరియట్ ముట్టడికి వెళ్తున్న కొంపల్లి బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర నేతలు తమ కుర్చీలు కాపాడుకోవడానికే సరిపోతోందని, ఇక రాష్ట్ర అభివృద్ధిని ఎప్పుడు పట్టించుకుంటారని ప్రశ్నించారు. బీజేపీ కొంపల్లి అధ్యక్షుడు సతీష్ సాగర్, నాయకులు కట్టా కుమార్, సుబ్బారావు, చక్రి, కార్పొరేటర్ రావుల శేషగిరిలను పోలీస్‌స్టేషన్‌కు తరలించి అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

పైపులైన్ లీకేజీతో బురదమయంగా రోడ్డు

సుభాష్‌నగర్: నర్సాపూర్– బాలానగర్ రహదారిలో అల్వాల్ వెళ్లే 1000 ఎంఎం డయా సామర్థ్యం గల గోదావరి పైపులైన్ తరచు లీకేజీ అవుతుంది. దీంతో నిత్యం రంగా భుజంగా థియేటర్ వద్ద రోడ్డు బురదమయంగా మారింది. అటుగా వెళ్లే వాహనాలు బురదలో కురుకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఓ ట్రాలీ ఆటో అందులో కురుకపోగా.. తోటి వాహనాదారులు కలిసి నెట్టారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి లీకేజీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శంకర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరిగేలా ఉత్సవ కమిటీ సభ్యులు సహకరించాలని మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. శుక్రవారం కొంపల్లిలోని ఏఆర్ గార్డెన్‌లో మేడ్చల్ జోన్ గణేశ్ మండపాల నిర్వాహకులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో ముందస్తు సన్నాహక సమావేశం నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రికల్, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో డీసీపీ పలు సూచనలు చేశారు. గణేశ్ మండపాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాల వద్ద భద్రతను నిర్వాహకులు చూసుకోవాలని, విగ్రహాలను నిమజ్జనాలను తరలించేంత వరకు ప్రశాంత వాతావరణలో పూజలు ముగిసేందుకు పోలీసులకు సహకరించాలన్నారు. అన్ని విభాగాల అధికారులు గణేశ్ ఉత్సవాలు విజయవంతంగా ముగిసేందుకు సమన్వయంతో పని చేయాలని కోరారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ పురుషోత్తం, పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శంకర్ రెడ్డి, బాలానగర్, మేడ్చల్ జోనల్ ట్రాఫిక్ ఏసీపీలు, సిబ్బంది పాల్గొన్నారు.

బలవంతపు చందా వసూళ్లు చేయొద్దు: ఏసీపీ శంకర్‌రెడ్డి

సుభాష్‌నగర్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎక్కడ కూడా బలవంతపు చందాలు వసూళ్లు చేయవద్దని మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి అన్నారు. సూరారం భీమా గార్డెన్‌లో సూరారం సీఐ సుధీర్ కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో పీస్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలు అంటేనే ఐక్యతకు నిదర్శనం అని అన్నారు. అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు మండపాల వద్ద పహారా ఉండాలన్నారు. విగ్రహాలను నిమజ్జనాలకు తరలించే వాహనాల ఫిట్‌నెస్ ఉందా?, లేదా? డ్రైవర్‌కు లైసెన్స్ ఉందా చూసుకుని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో డీజేలు పెట్టొద్దని, ప్రశాంతంగా పండుగ జరుగడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సూరారం పీఎస్ పరిధిలోని ఉత్సవ కమిటీ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వీధి దీపాలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపల్ బహదూర్‌పల్లిలోని 15వ వార్డులో 'సాక్షి' కథనానికి అధికారులు స్పందించారు. 15వ వార్డులో రెండు నెలల నుంచి వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. ఈ విషయమై 'రెండు నెలలుగా వెలగని వీధిలైట్లు' అనే శీర్షికతో సాక్షి కథనం ప్రచురించింది. దీంతో అధికారులు స్పందించి శుక్రవారం ఉదయం సిబ్బందితో వీధిలైట్లు వెలిగేలా మరమ్మతులు చేశారు.



నేడు నల్లగుట్ట ఆలయంలో పూజలు

సుభాష్‌నగర్: జీడిమెట్ల బస్ డిపో వద్ద ఉన్న నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరి శనివారం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శుక్రవారం పేర్కొంది. శనివారం ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, అర్చనలు, సాయంత్రం ఐదు గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

26న ఎస్‌జీఎఫ్ జోనల్ లెవెల్ క్రికెట్ సెలక్షన్స్

కుత్బుల్లాపూర్: 69వ ఎస్‌జీఎఫ్ కుత్బుల్లాపూర్ జోనల్ లెవెల్ క్రికెట్ సెలక్షన్స్‌ను ఈ నెల 26న నిర్వహించనున్నామని జోనల్ సెక్రటరీ గోనె అరుణ జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాయ్స్ అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఈ పోటీలు జరుగనున్నాయి. అండర్ 14లో పాల్గొనదలిచే జట్టు సభ్యులు 6వ తరగతి, జనవరి 1, 2012 తరువాత జన్మించి ఉండాలని, అండర్–17లో పాల్గొనే సభ్యులు 6వ తరగతి పైబడి, జనవరి 1, 2009 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒక ఏజ్ కేటగిరీలో ఆడిన వాళ్లు ఇంకో ఏజ్ కేటగిరిలో ఆడకూడదన్నారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు స్కూల్ బోనఫైడ్ , ఆధార్‌లను అందజేయాల్సి ఉంటుందన్నారు. ఉదయం 8 గంటలకు చింతల్ హెచ్‌ఎంటీ కాలనీలోని వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ ఆవరణలోని ఆర్‌డీఎస్ క్రికెట్ అకాడమీలో రిపోర్ట్ చేయాలని, ఇతర వివరాలకు 9290496443లో సంప్రదించాలని కుత్బుల్లాపూర్ జోనల్ సెక్రటరీ అరుణ కోరారు.

దుకాణంలో వెండి పట్టీలు చోరీ

జీడిమెట్ల: గుర్తు తెలియని వ్యక్తులు జ్యువెలరీ దుకాణంలో 500 గ్రాముల వెండి పట్టీలు ఎత్తుకెళ్లిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ విమానపురి కాలనీకి చెందిన నరసింహాచారి అదే ప్రాంతంలో ధనలక్ష్మి నగల దుకాణం నడిపిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి 9.30 గంటల ప్రాంతంలో తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం తెలిసిన వ్యక్తి నరసింహచారికి ఫోన్ చేసి షెట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయని తెలిపాడు. వెంటనే అక్కడకు వెళ్లి చూడగా.. లోపల ఉన్న 500 గ్రాముల వెండి పట్టీలు కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవ్వాలి

- భూ భారతి వచ్చినా గ్రామాల్లో భూ సమస్యలు
- భూపోరాటాలపై కార్యాచరణ రూపొందించాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

సుభాష్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐ శ్రేణులు రాష్ట్రంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాజులరామారంలోని కామ్రేడ్ బాలమల్లేశ్ హాల్‌లో జరుగుతున్న సీపీఐ 4వ రాష్ట్ర మహాసభలో శుక్రవారం ఆయన మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన చరిత్ర సీపీఐకే ఉందన్నారు. ఎర్రజెండా వద్దకు వెళితేనే తమకు నీడ దొరుకుతుందనే నమ్మకం నేటికీ పేదల ప్రజల్లో ఉండటం పార్టీకి గర్వ కారణమన్నారు. ఆ నమ్మకాన్ని కాపాడుకునే విధంగా భూపోరాటాల ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో ధరణి పోయి భూ భారతి వచ్చినప్పటికీ క్షేత్ర స్థాయిలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని,. ఇప్పటికీ గ్రామ స్థాయిలో భూ సమస్యలు నెలకొన్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఉద్యమాలే ఊపిరి అని, ప్రజా సంఘాలను బలోపేతం చేసే దిశగా పార్టీ నాయకులు, శ్రేణులు కంకణబద్ధులు కావాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం పేరుతో నియంతృత్వ, ఫాసిస్టు పాలనను కొనసాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని ఎదుర్కొనేందుకు వామపక్ష పార్టీలు ఆచితూచి అడుగులు వేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులతో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూం నివాసితులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ నివాసితులకు సౌకర్యాలు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకట రామయ్య నేతృత్వంలో పార్టీ నాయకులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఆరోపించారు. మంచినీటి సమస్యతో పాటు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ లేక విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

చలో కలెక్టరేట్‌కు పిలుపు

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సంతోష్, ఎం.శంకర్, ఎం.చంద్రశేఖర్, బాల వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ఎన్.బాలపీరు, పి.స్వామి, డేవిడ్ స్వామి, అక్బర్‌అలీ ఖాన్ పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలి



కొంపల్లిలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: శ్మశాన వాటికల్లో సరైన సదుపాయాలు లేక దహన సంస్కారాలకు వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్‌సాగర్ అన్నారు. శుక్రవారం కొంపల్లి, దూలపల్లి ప్రాంతాల్లోని శ్మశాన వాటికల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా శ్మశాన వాటికల్లో సదుపాయాలు లేక ప్రజలు బొల్లారం, అల్వాల్ ప్రాంతాల్లోని వైకుంఠ ధామాలకు వెళ్లి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడం, నిర్మాణ వ్యర్థాలు డంప్ చేయడంతో నిరుపయోగంగా ఉన్నాయన్నారు. అధికారులకు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరిత రావు, అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు బూర్గుబావి అశోక్, సీనియర్ నాయకులు నరసింహ, చక్రదర్ తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన ఇంటర్నెట్.. మొబైల్ ద్వారా సేవలు



పీఏసీఎస్ కార్యాలయంలో ఫోన్ ద్వారా సేవలు

సుభాష్‌నగర్: స్టార్ కేబుల్, ఇంటర్నెట్ కేబుల్ లను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులతో ఎక్కడికక్కడ కట్ చేయించింది. దీంతో చాలాచోట్ల టీవీలు ఆగిపోగా, ప్రైవేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. కొన్ని చోట్ల ప్రత్యామ్నాయంగా మొబైల్ ద్వారా అధిక డేటాను వేసుకొని కార్యాలయంలో పనులను కొనసాగిస్తున్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో ఇంటర్నెట్ కేబుల్ వైర్లను ఎడాపెడా కట్ చేయడంతో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో స్థానిక ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో నాలుగు రోజుల నుంచి ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. రెండు ఫోన్ల ద్వారా రోజుకు 10 జీబీ డాటా వేసుకొని బ్యాంకులో ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలను అందిస్తున్నట్లు బ్యాంకు సీఈవో తీగల కృష్ణ తెలిపారు.

జిల్లాలో అక్షరాస్యతను పెంచాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిలందరూ ముందుకొచ్చి బాధ్యతాయుతంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో అక్షరాస్యతను పెంచేందుకు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా తెలిపారు. చదువుకు వయస్సు అడ్డంకి కాదని, ఒకరితో మోసపోవడం, ఒకరిపై ఆధారపడకూడదన్నారు. మహిళా సంఘాల గ్రూపు సభ్యులు చుట్టు పక్కల వారందరూ చదువుకునేలా చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాను అక్షరాస్యతలో అగ్రగామిగా నిలిపాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మహిళా సంఘాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉల్లాస్ యాప్ నమోదులో చాలా వెనుకబడి ఉన్నామని, 47,867 లక్ష్యానికి 21,263 మాత్రమే పూర్తయిందని రాధికాగుప్తా పేర్కొన్నారు. డీఆర్డీఏ సాంబశివరావు, డీఈఓ విజయకుమారి, ఉల్లాస్ ప్రాజెక్ట్ అధికారులు, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, మూసాపేట మున్సిపల్ సర్కిళ్ల పరిధిలోని మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే చెత్త డంపింగ్

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట పైపులైన్ రోడ్డు నుంచి షాపూర్ నగర్ వెళ్లే దారిలో సుమారు కిలోమీటర్ మేర తీవ్ర దుర్గంధం వస్తుంది. జవహర్ నగర్ డంపింగ్ యార్డులో రాంకీ కార్మికులు జీతాల కోసం అది, సోమ వారాల్లో ధర్నా చేశారు. ఆ రెండు రోజులు జగద్గిరిగుట్టలోని ఎస్‌సీటీపీ ప్లాంట్ వద్ద చెత్త డంపింగ్ మొత్తం జామైంది. జవహర్ నగర్ డంపింగ్ యార్డుకు వెళ్లాల్సిన వాహనాలు ఇక్కడే ఉంచడం, రోజు ఆటోలో వచ్చే చెత్తను ప్లాంట్‌లోకి అనుమతించకపోవడం, ఇక చెత్తను రోడ్డు పైనే డంప్ చేయడం మొదలుపెట్టారు. ఆ తర్వాత ప్లాంట్‌లో అనుమతించిన ఆటోవాలాలు మాత్రం చెత్తను బయటే రోడ్లపై డంప్ చేయడం మత్రం మానలేదు. దీంతో ఈ రోడ్డులో ట్రాఫిక్ జాంతో పాటు వాహనాదారులు తీవ్ర దుర్గందంతో ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తుంది. విషయమై సంబంధిత అధికారులకు తెలిపినట్లు రాంకీ సిబ్బంది తెలిపింది. ఇప్పటికైనా అధికారలు ఈ విషయమై చొరవ చూపి దీనికి పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే డంప్ చేసిన చెత్త



చెత్తను డంప్ చేస్తుండగా స్తంభించిన రాకపోకలు